తెలంగాణ TELANGANA MUCHATLU

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | గురువారం - 12 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 283 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం దేశంపై పడుతోంది: కేటీఆర్

- ఎల్పీజీ కొరతతో హోటళ్ల మూసివేతపై ఆందోళన
- ప్రపంచ యుద్ధాల్లో పురుష నాయకులే ముందుంటున్నారని వ్యాఖ్య
- మహిళా నాయకత్వం అవసరమని కేటీఆర్ అభిప్రాయం

ప్రభుత్వ హామీతో నిరవధిక కవిత దీక్ష ముగింపు

- జస్టిస్ ఈశ్వరయ్య నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేత
- పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని కవిత

2వ పేజీలో..

స్పీకర్ తీర్పుపై విమర్శలు అనవసరం: దానం నాగేందర్

- నిబంధనలు ఎక్కడా ఉల్లంఘించలేదని స్పష్టం
- కేటీఆర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఆగ్రహం
- రేవంత్ రెడ్డిని డీమోరలైజ్ చేయడం ఎవరి వల్లా కాదని వ్యాఖ్య

స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి అవమానం

- తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు
- ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో స్పీకర్ నిర్ణయంపై విమర్శలు
- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడంపై అభ్యంతరం
- కాంగ్రెస్ వైఖరిపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు కొట్టివేత..

10 మందికి స్పీకర్ క్లీన్ చిట్

దానం నాగేందర్, కడియం శ్రీహరిపై ఆరోపణలకు ఆధారాలు లేవని స్పష్టం

పార్టీ మారినట్లు నిరూపణ కాలేదని వ్యాఖ్య

సుప్రీంకోర్టు విచారణకు ముందే స్పీకర్ నిర్ణయం

హైదరాబాద్, 11 మార్చి (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముగింపు పలికారు. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేస్తూ వారికి క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిద్దరూ అధికారికంగా పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేవని స్పీకర్ తన తీర్పులో పేర్కొన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం

- లోక్‌భవన్‌లో జరిగిన ఘన కార్యక్రమం
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేత ప్రమాణం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా ప్రముఖుల హాజరు

హైదరాబాద్, 11 మార్చి (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో నిర్వహించిన ఘన కార్యక్రమంలో ఆయన గవర్నర్ పదవిని స్వీకరించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి శివ ప్రతాప్ శుక్లాను ఆహ్వానిస్తూ స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రజల తరపున కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కలిసి పనిచేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు.

మిగతా 2లో..

రోడ్ల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రోడ్లు, భవనాల శాఖపై సమీక్ష సమావేశం
- రోడ్ సెక్టార్ పాలసీ–2047కు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం
- జిల్లా కేంద్రాలకు రింగ్ రోడ్ల ప్రతిపాదనలు పరిశీలించాలని సూచన

హైదరాబాద్, 11 మార్చి (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి కోసం రోడ్ సెక్టార్ పాలసీ-2047కు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మిగతా 2లో..

కాంగ్రెస్ ప్రభుత్వంపై సీపీఐ ఆగ్రహం.. చలో అసెంబ్లీకి పిలుపు

- పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఈ నెల 20న నిరసన
- సింగరేణి రక్షణకు వారం రోజుల ఆందోళనలు
- పాత్తు కొనసాగింపుపై కాంగ్రెస్ వైఖరి స్పష్టంచేయాలని డిమాండ్

హైదరాబాద్, 11 మార్చి (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై సీపీఐ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ మిత్రధర్మం పాటించడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు.

మిగతా 2లో..

ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ కార్యక్రమం అమలులో అలసత్వం వద్దు: మంత్రి దామోదర్ రాజనర్సింహ

మహిళల ఆరోగ్య పరీక్షల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష

గ్రామాల నుంచి మహిళలను ఆసుపత్రులకు తరలించేందుకు వాహనాల ఏర్పాటు సూచన

హైదరాబాద్, 11 మార్చి (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు నిర్వహిస్తున్న ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ కార్యక్రమం అమలులో ఎలాంటి అలసత్వం ఉండకూడదని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ నెల 8న ప్రారంభమైన ఈ కార్యక్రమ పురోగతిపై ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు కొట్టివేత..

(మొదటి పేజీ తరువాయి)

ఈ అంశంపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉండగా, కోర్టు విచారణకు ముందు రోజు స్పీకర్ తన విచారణను ముగించి తీర్పు వెలువరించారు. దానం నాగేందర్, కడియం శ్రీహరితో పాటు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు కూడా స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం గమనార్హంగా మారింది.

ఫిర్యాదుదారులు సమర్పించిన ఆధారాలు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించడానికి సరిపోవని స్పీకర్ తన నిర్ణయంలో స్పష్టం చేశారు. పార్టీ మారినట్లు నిరూపించే తగిన సాక్ష్యాలు లేకపోవడంతో అనర్హత వేటు విధించలేమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. స్పీకర్ తీర్పుపై ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి నాయకులు ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ఈ వ్యవహారం సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లిన నేపథ్యంలో తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయన్నదానిపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

రోడ్ల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

హైదరాబాద్‌ను ట్రాఫిక్ రహిత నగరంగా తీర్చిదిద్దే దిశగా కనెక్టివిటీ రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని చెప్పారు. జిల్లా కేంద్రాలకు రింగ్

రోడ్ల ఏర్పాటు ప్రతిపాదనలను పరిశీలించాలని సూచించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై సీపీఐ ఆగ్రహం.. చలో అసెంబ్లీకి పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడేందుకు వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న విధానాలపై కూడా విమర్శలు గుప్పించారు. అమెరికా చర్యలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని కోరుతూ ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు అనుకూలంగా లేవని సాంబశివరావు విమర్శించారు. రైతులకు అందించే రైతు బంధు పథకంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐతో పొత్తు ఉండటం వల్లే పలు ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు విజయాలు సాధ్యమయ్యాయని, లేదంటే ఇంకా ఎక్కువ స్థానాల్లో గెలిచేవాళ్లమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు సీపీఐ నాయకులను అవమానిస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరి మారకపోతే పొత్తు నుంచి దూరం కావడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఫిరాయింపులపై చట్టాలు బలంగా అమలు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

ఉమెన్ వెల్‌నెస్ ప్రొఫైలింగ్ కార్యక్రమం అమలులో అలసత్వం వద్దు: మంత్రి దామోదర్ రాజనర్సింహ

(మొదటి పేజీ తరువాయి)

అలాగే సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌తో పాటు అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ఇతర ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశానికి హాజరయ్యారు. మహిళలను గ్రామాల నుంచి ఆసుపత్రులకు తీసుకువచ్చేందుకు, పరీక్షల అనంతరం తిరిగి సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు వాహనాలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఆసుపత్రుల్లో మహిళలు ఎక్కువసేపు వేచి ఉండకుండా అవసరమైన డాక్టర్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. తాగునీరు, కుర్చీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. స్క్రీనింగ్‌లో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు తేలితే వెంటనే చికిత్స ప్రారంభించాలని మంత్రి స్పష్టం చేశారు. రక్త నమూనాల సేకరణ నుంచి ల్యాబ్‌లకు తరలించే వరకు కోల్డ్ చైన్ విధానాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. జిల్లాల డీఎంహెచ్‌వోలు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలోని 32 జిల్లాల్లోని 542 మండలాల్లో సుమారు 46 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. అనీమియా, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్, కాలేయం, కిడ్నీ పనితీరు వంటి పరీక్షలు ఇందులో భాగంగా ఉంటాయి. మహిళల ఆరోగ్య సమాచారాన్ని క్యూఆర్ కోడ్ ఆధారిత డిజిటల్ హెల్త్ రికార్డులుగా భద్రపరచి, ఈహెచ్ఎంఐఎస్ ప్లాట్‌ఫారమ్‌తో అనుసంధానం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి అవమానం

హైదరాబాద్, 11 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో శాసనసభ స్పీకర్ వెలువరించిన తీర్పు ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా రామచందర్ రావు విమర్శించారు. నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి కొద్ది కాలంలోనే పార్టీ మారి కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనని అన్నారు. ఇంత స్పష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ అది పార్టీ ఫిరాయింపు కాదని స్పీకర్ తీర్పు ఇవ్వడం ఆశ్చర్యకరమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రజల తీర్పును, ప్రజాస్వామ్య విలువలను అవమానించడం వంటిదేనని వ్యాఖ్యానించారు. ప్రజల ముందే జరిగిన ఘటనను కూడా ఫిరాయింపుగా పరిగణించకపోవడం విచారకరమని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకత్వాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగంగా ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడతామని చెప్పే కాంగ్రెస్ పార్టీ ఈ పరిస్థితిని ఎలా సమర్థిస్తుందో స్పష్టం చేయాలని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. స్పీకర్ తీర్పు రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి తీరని అవమానమని నల్లా రామచందర్ రావు పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

ఖమ్మంలో 'లైఫ్ లైన్ ఫౌండేషన్' బ్యానర్ ఆవిష్కరణ

- పేదలకు అండగా నిలవాలి
- క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి

ఖమ్మం బ్యూరో, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): నగరంలో సేవా దృక్పథంతో ఏర్పాటైన 'లైఫ్ లైన్ ఫౌండేషన్' బ్యానర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో, ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ జానీ మియా అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఫౌండేషన్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో నిరుపేదలకు సేవ చేయాలనే సంకల్పంతో ఈ సంస్థను స్థాపించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఫౌండేషన్ మరిన్ని విస్తృతమైన సేవా కార్యక్రమాలు చేపట్టి, పేద ప్రజల గుండెల్లో నిలవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు తుంబూరి దయాకర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ జానీ మియాతో పాటు సభ్యులు షేక్ ఇమ్రాన్, షేక్ మదర్ సాహెబ్, తేజావత్ నరసింహారావు, ఎండి. జుల్ఫీకర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం దేశంపై పడుతోంది: కేటీఆర్

హైదరాబాద్, 11 మార్చి (తెలంగాణ ముచ్చట్లు) : దేశంలో ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయని భారత రాష్ట్ర సమితి నాయకుడు కేటీఆర్ అన్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం ప్రభావం భారత్‌పై కూడా పడుతోందని ఆయన పేర్కొన్నారు. ఎల్పీజీ గ్యాస్ సరఫరా సమస్యల కారణంగా హోటళ్లు మూసివేయాల్సిన పరిస్థితి వస్తోందని హోటల్ అసోసియేషన్లు చెబుతున్నాయని తెలిపారు. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఇతర దేశాలపై ప్రభావం చూపుతాయని కేటీఆర్ అన్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న ఈ యుద్ధం కూడా అలాంటి ప్రభావాన్ని కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంధన సరఫరా, వాణిజ్య రంగాలపై ఈ పరిస్థితులు ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. యుద్ధాల్లో పాల్గొంటున్న దేశాల నాయకత్వంపై కూడా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల్లో పాల్గొంటున్న దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు, ముఖ్య నాయకులు ఎక్కువగా పురుషులేనని అన్నారు. ప్రపంచ చరిత్రలో మహిళా నాయకులు తమ దేశాలను యుద్ధంలోకి నెట్టిన ఉదాహరణలు చాలా తక్కువగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సమాజంలో మహిళా నాయకత్వానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. మహిళలు నాయకత్వం వహిస్తే శాంతి, సహకారం వంటి విలువలు బలపడే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచం శాంతియుత దిశగా ముందుకు సాగేందుకు మహిళా నాయకత్వం కీలక పాత్ర పోషించగలదని కేటీఆర్ అన్నారు.

ప్రభుత్వ హామీతో నిరవధిక కవిత దీక్ష ముగింపు

హైదరాబాద్, 11 మార్చి (తెలంగాణ ముచ్చట్లు) : ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేపట్టిన నిరవధిక దీక్షను విరమించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య నిమ్మరసం ఇచ్చి కవితతో పాటు ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్‌కు దీక్షను విరమింపజేశారు. వెలుగుమట్ల భూదాన్ భూమి సమస్యపై ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో వెలుగుమట్లలో అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. మొత్తం 412 మందిని గుర్తించి పట్టాలు అందజేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వెలుగుమట్ల పేదలకు న్యాయం చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో దీక్షను విరమించినట్లు కవిత పేర్కొన్నారు. పట్టాలు పొందిన వారు త్వరలోనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. దీక్ష విరమణ సందర్భంగా కవిత మాట్లాడుతూ తమ పోరాటం పూర్తిగా ముగియలేదని, కేవలం విరామం మాత్రమే అని అన్నారు. వెలుగుమట్ల బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆందోళనలు, మహిళల నిరసనల కారణంగానే ప్రభుత్వం స్పందించిందని కవిత పేర్కొన్నారు.

స్పీకర్ తీర్పుపై విమర్శలు అనవసరం: దానం నాగేందర్

హైదరాబాద్, 11 మార్చి (తెలంగాణ ముచ్చట్లు) : ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన తీర్పు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. తనపై వస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. తాను ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై దానం నాగేందర్ తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి పదవి పోయిందని కేసీఆర్ కంటే కేటీఆర్‌నే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని ఎద్దేవా చేశారు. పదవి తమ ఆస్తి అని కొందరు భావిస్తున్నారని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. తాను కేవలం పార్లమెంట్ సభ్యుడిగా మాత్రమే పోటీ చేశానని, ఎక్కడా అధికారికంగా కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదని దానం నాగేందర్ తెలిపారు. శాసనసభలో పార్టీ విప్‌ను ఎప్పుడూ ఉల్లంఘించలేదని, పార్టీకి వ్యతిరేకంగా పని చేయలేదని స్పష్టం చేశారు. ఒకవేళ స్పీకర్ తీర్పు తనకు వ్యతిరేకంగా వచ్చినా ఉప ఎన్నికల్లో గెలిచి చూపేవాడినని ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ ఎంపీ ఎన్నికల్లో తన ఓటమికి బీఆర్ఎస్, బీజేపీల కలయిక కారణమని ఆయన ఆరోపించారు. తాను ఎంపీగా గెలిచి ఉంటే ఈ వివాదం ఉండేదే కాదని అన్నారు. ఖైరతాబాద్ ప్రజల కోసం సైనికుడిలా పని చేస్తానని, రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశించిన విధంగా ఫలితాలు వస్తాయని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

వీరితో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

లోక్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. కొత్త గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివ ప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తారని రాష్ట్ర నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

వెల్టూర్ గ్రామంలో గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు

పెద్దమందడి,మార్చి11(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో పశువుల ఆరోగ్య రక్షణ కోసం గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగింది. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది గ్రామంలోని రైతుల గేదెల వద్దకే వెళ్లి టీకాలు వేసి సేవలు అందించారు.గాలికుంటు వ్యాధి పశువుల్లో త్వరగా వ్యాపించే ప్రమాదకరమైన వ్యాధి కావడంతో ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ టీకాలు వేయడం ఎంతో ముఖ్యమని పశువైద్య సిబ్బంది రైతులకు తెలిపారు.గ్రామంలోని పలు రైతుల గేదెలకు టీకాలు వేసి పశువుల ఆరోగ్యం పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్ పాల్గొని పశువైద్య సిబ్బందితో కలిసి రైతులను ప్రోత్సహించారు.పశువుల ఆరోగ్యం కాపాడుకోవడం ద్వారా రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని సర్పంచ్ అశోక్ అన్నారు. ప్రతి రైతు తమ పశువులకు సమయానికి టీకాలు వేయించుకోవాలని సూచించారు.గ్రామంలో పశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇలాంటి కార్యక్రమాలు కొనసాగాలని రైతులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్,ప్రేమ్ సాగర్, పెద్ద శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై సీపీఎం నిరసన

నాచారం, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం నాచారం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు పి. గణేష్ మాట్లాడుతూ యుద్ధ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.యుద్ధాన్ని కారణంగా చూపుతూ వంట గ్యాస్ ధరలను పెంచడం సామాన్య ప్రజలపై మరింత భారాన్ని మోపడం అవుతుందని ఆయన అన్నారు.అంతర్జాతీయ పరిస్థితులను కారణంగా చూపుతూ గృహ అవసరాల గ్యాస్‌పై రూ.60, కమర్షియల్ గ్యాస్‌పై రూ.114 పెంచడం ప్రజలకు అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రజల జీవన వ్యయాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ధరల పెంపుతో ప్రజలపై మరింత భారాన్ని మోపుతోందని విమర్శించారు. వెంటనే వంట గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకుని ప్రజలకు ఊరట కల్పించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా యుద్ధానికి దిగడం తగదని ఆయన అన్నారు. యుద్ధాలు సమస్యలకు పరిష్కారం కావని, శాంతి చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. యుద్ధాల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో అస్థిరత నెలకొని నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో బాలరాజ్, ఎల్లేష్, నర్సింహా, సంజీవ్, పాండు, రాజయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి పీజీ కళాశాలకు బాలుర, బాలికల హాస్టళ్ల మంజూరు

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

వనపర్తి,మార్చి11(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల విద్యార్థుల సమస్యను దృష్టిలో ఉంచుకొని బాలుర, బాలికల హాస్టళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు.వనపర్తిలో తాను మంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వ పీజీ కళాశాలను మంజూరు చేసి నిర్మించుకున్నామని ఆయన గుర్తు చేశారు.అయితే అప్పటి నుండి పీజీ చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు.ఇటీవల రాష్ట్ర ప్రజా ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు హాస్టల్ సౌకర్యం లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకువచ్చారని చిన్నారెడ్డి తెలిపారు.ఈ విషయంపై వెంటనే స్పందించి పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ తో చరవాణి ద్వారా మాట్లాడినట్లు ఆయన చెప్పారు. యూనివర్సిటీ గ్రాంట్స్ ద్వారా పీజీ బాలికల హాస్టల్‌కు 200 మంది విద్యార్థినుల కోసం రూ. 9.11 కోట్లు, పీజీ బాలుర హాస్టల్‌కు 150 మంది విద్యార్థుల కోసం రూ. 6.72 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు.హాస్టళ్ల మంజూరుకు స్పందించి సహకరించిన పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.పీజీ విద్యార్థుల చిరకాల కోరిక అయిన హాస్టల్ సౌకర్యం త్వరలోనే నిర్మాణం ప్రారంభమై నెరవేరుతుందని చిన్నారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

- సుమారు రూ.8 లక్షల ఆస్తి నష్టం అంచనా
- ఘటనపై పోలీసులకు ఫిర్యాదు – దర్యాప్తు ప్రారంభం

కాప్రా, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని కాప్రా సర్కిల్ పరిధిలో సౌత్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో అనుమానాస్పద స్థితిలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో కార్యాలయంలో ఉన్న ఫర్నీచర్‌తో పాటు పలు ముఖ్యమైన రికార్డులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటల తీవ్రతతో భవనానికి పగుళ్లు ఏర్పడినట్లు సమాచారం.అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు ముందుగా మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అసోసియేషన్ సభ్యుల వివరాల ప్రకారం మధ్యాహ్నం సుమారు 12.30 గంటల వరకు కార్యాలయంలోనే ఉన్నామని, అనంతరం ఇంటికి వెళ్లిన తర్వాత ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఇది విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందని అనుమానం లేదని వారు పేర్కొన్నారు.ఇటీవల అసోసియేషన్‌లో అంతర్గత విభేదాలు తలెత్తి రెండు వర్గాలుగా చీలిన నేపథ్యంలో ఈ ఘటన అనుమానాలకు తావిస్తోంది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అసోసియేషన్ ప్రతినిధులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పదవ తరగతి విద్యార్థులకు ఉచిత ఎగ్జామినేషన్ ప్యాడ్స్

- దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమం.
- కాకర్లపల్లి, నాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పంపిణీ.
- ఊటుకూరు వెంకట్, సూర్య రాట్నాల ఆధ్వర్యంలో కార్యక్రమం.

సత్తుపల్లి, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు దమ్మపేట మండలం నాచారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా ఎగ్జామినేషన్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులు సౌకర్యంగా రాయడానికి వీలుగా ఈ ప్యాడ్స్ అందజేశారు. విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామినేషన్ ప్యాడ్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఊటుకూరు వెంకట్ , సూర్య రాట్నాల సేవలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్థులు అభినందించారు.

ఉపాధ్యాయుడు మట్టా అజయ్ కుమార్‌కు ఘన సన్మానం.!

- సత్తుపల్లిలో పదవీ విరమణ సందర్భంగా అభినందనలు.
- కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా పాల్గొన్నారు.

సత్తుపల్లి, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి మండలం సదాశివుని పాలెం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించిన మట్టా అజయ్ కుమార్ పదవీ విరమణ సందర్భంగా పట్టణంలోని మాధురి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఘనంగా సన్మానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ హాజరై అజయ్ కుమార్‌ను శాలువా కప్పి సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాగే టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయ బాబు కార్యక్రమంలో పాల్గొని అజయ్ కుమార్‌ను అభినందించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన అందించిన సేవలను కొనియాడుతూ, పదవీ విరమణ అనంతర జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, ప్రధాన ఉపాధ్యాయులు, గాదె చెన్నారావు, నాయుడు వెంకటేశ్వరరావు, మట్టా ప్రసాద్, దొడ్డా రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు వెబ్‌సైట్ ద్వారా గుర్తింపు కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్–మల్కాజిగిరి, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): విద్యార్థులలోని కళలు మరుగున పడకుండా వాటికి సరైన గుర్తింపు లభించేలా ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి అందులో విద్యార్థుల ప్రతిభను అప్‌లోడ్ చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు.బుధవారం ఘట్కేసర్ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం సమయానికి పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహంలో అందుతున్న బోధన విధానంపై కూడా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.కూచిపూడి, గిటార్, కీబోర్డ్, పెయింటింగ్ వంటి విభాగాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల సంఖ్య, సర్టిఫికెట్ కోర్సుల వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులు వేసిన పెయింటింగ్‌లను పరిశీలించి, ఒక కొత్త వెబ్‌సైట్ రూపొందించి అందులో విద్యార్థుల చిత్రాలను ఉంచితే ఆసక్తి గలవారు ఆర్డర్లు ఇచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ నేర్చుకున్న విద్యార్థులను ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ వారికి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆడుకోవడానికి ఫుట్‌బాల్, చెస్, వాలీబాల్‌తో పాటు ఆర్ట్‌స్‌కు అవసరమైన సామగ్రి అందించాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అవసరమైన వస్తువులు తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చారు.స్కూల్ యాజమాన్యం అవసరమైన వస్తువులు, విద్యార్థులు కోరిన క్రీడా సామగ్రి వివరాలతో ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అనంతరం స్టోర్‌రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ ఎక్స్‌పైరీ డేట్లను తనిఖీ చేస్తూ గడువు లోపే వంట సామగ్రిని వినియోగించాలని, నాణ్యమైన పదార్థాలనే ఉపయోగించాలని సూచించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

సాయి కృష్ణ నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గంలోని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాయి కృష్ణ నగర్ కాలనీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు తదితర అభివృద్ధి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ బాలకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, కాలనీ వాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల సాధికారతకు శ్రీ శక్తి అవార్డులు ప్రేరణ

మల్లాపూర్, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): మల్లాపూర్ డివిజన్‌లోని మున్సిపల్ వార్డ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన శ్రీ శక్తి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నెమలి అనిల్ కుమార్ హాజరై మహిళలను అభినందించారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ మహిళలు నేటి సమాజంలో ప్రతి రంగంలో ముందంజలో నిలుస్తూ కుటుంబం, సమాజం మరియు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం, సమాజం కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ప్రోత్సాహం కలిగించే ఉద్దేశంతో శ్రీ శక్తి అవార్డులను ఏర్పాటు చేసి ఘనంగా నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. మహిళలు విద్య, ఉపాధి, సామాజిక సేవ వంటి రంగాల్లో మరింతగా ముందుకు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాలు గ్రంథాలయంకు అందచేత

భీమదేవరపల్లి,మార్చి11(తెలంగాణ ముచ్చట్లు): సుమతి రెడ్డి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలోని ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ మరియు ఉన్నత భారత్ అభియాన్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యా సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఐ. రాజశ్రీ రెడ్డి గారి మార్గనిర్దేశంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు విస్తరించేందుకు, పోటీ పరీక్షలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా జరిగింది. ఈ సందర్భంగా భీమదేవరపల్లి గ్రామంలోని గ్రామ గ్రంథాలయానికి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలైన ఎంసెట్ మరియు ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉపయోగపడే సుమారు 100 పుస్తకాలను అందజేశారు. ఈ పుస్తకాలను కళాశాల ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ అడ్వైసర్ శ్రీ మూల రాము గారి ఆధ్వర్యంలో విద్యార్థి వాలంటీర్లు గ్రామ సర్పంచ్ శ్రీ మాచర్ల కుమార్ గౌడ్ గారికి మరియు గ్రామ పాలకవర్గ సభ్యులకు అధికారికంగా అందించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన అధ్యయన వనరులు అందుబాటులోకి రావడంతో పాటు, వారు పోటీ పరీక్షలకు మెరుగైన సన్నద్ధత సాధించేందుకు ప్రోత్సాహం లభిస్తుంది. గ్రామ సర్పంచ్ శ్రీ మాచర్ల కుమార్ గౌడ్ గారు ఈ పుస్తకాల అందజేతకు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డా. ఐ. రాజశ్రీ రెడ్డి గారు, ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ అడ్వైసర్ శ్రీ మూల రాము గారు మరియు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థి వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.కళాశాల తరఫున కూడా గ్రామీణ విద్యార్థుల అభివృద్ధి కోసం ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడమే కాకుండా, గ్రామీణ సమాజంతో విద్యాసంస్థల అనుబంధాన్ని బలపరిచే మంచి ఉదాహరణగా నిలిచింది.

అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు అందజేత

ఖమ్మం బ్యూరో, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): చింతకాని మండలంలోని రేపల్లెవాడ గ్రామ అంగన్వాడీ కేంద్రానికి అవసరమైన కుర్చీలను స్థానికులు విరాళంగా అందజేశారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి శివ, పోతగాని పుల్లారావు కలిసి అంగన్వాడీ కేంద్రానికి పది కుర్చీలు అందించారు. చిన్నారులు అలాగే అంగన్వాడీ కేంద్రానికి వచ్చే తల్లిదండ్రులు సౌకర్యవంతంగా కూర్చునేందుకు ఈ కుర్చీలు ఉపయోగపడతాయని వారు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్థానికుల సహకారంతో అంగన్వాడీ కేంద్రంలో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండి శ్రీను, సామినేని శ్రీనివాస్, షేక్ ఏసోబు, వడ్డెబోయిన గోపి, మాసిబోయిన రామారావు, వడ్రానపు వెంకటేశ్వర్లు,అంగన్వాడీ టీచర్ కట్ట ఉప్పలమ్మ , బంధం యాదగిరి , బంధం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వేం నరేందర్ రెడ్డికి ఉప్పల్ కాంగ్రెస్ నేతల శుభాకాంక్షలు

ఉప్పల్, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): సీఎం సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నేత వేం నరేందర్ రెడ్డిని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా ఈ సమావేశం జరిగింది.ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేం నరేందర్ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంజయ్య గుప్తా, చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి, బజార్ జగన్నాథ్ గౌడ్, తెల్కల మోహన్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, ఈగ ఆంజనేయులు ముదిరాజ్ , తుమ్మల దేవి రెడ్డి, డిల్లీ చంద్రశేఖర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయిదు గంటల్లో అయిదు సాధారణ కాన్పులు.!

- అశ్వారావుపేట ఏరియా ఆసుపత్రిలో అరుదైన ఘటన .
- తల్లీబిడ్డలు క్షేమం.

అశ్వారావుపేట, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలోని ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది అరుదైన ఘనత సాధించారు. కేవలం అయిదు గంటల వ్యవధిలో అయిదు సాధారణ కాన్పులు నిర్వహించి ప్రత్యేకతను చాటుకున్నారు. వీరిలో ముగ్గురు మగబిడ్డలు, ఇద్దరు ఆడబిడ్డలు జన్మించారు. తల్లులు, శిశువులు అందరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి బుధవారం తెల్లవారుజామున 5 గంటల మధ్య ఈ అయిదు సుఖ ప్రసవాలు జరిగాయి. వైద్య సిబ్బంది సమన్వయంతో అన్ని ప్రసవాలు సాఫీగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి మాట్లాడుతూ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గతంలో సురక్షిత ప్రసవాల కోసం గర్భిణీలు సుమారు 80 కిలోమీటర్ల దూరంలోని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డీసీహెచ్ఎస్ రవి బాబు సహకారంతో అశ్వారావుపేట ఆసుపత్రిలో అనేక సౌకర్యాలు కల్పించామని వివరించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 24 గంటల ప్రసూతి వైద్యుల పర్యవేక్షణ, ఆపరేషన్ థియేటర్, మెటర్నిటీ వార్డుల్లో ఏసీ సౌకర్యం, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా టిఫా స్కాన్‌తో పాటు అన్ని రకాల రక్త పరీక్షలు కూడా ఆసుపత్రిలోనే నిర్వహిస్తున్నామని చెప్పారు. దీంతో గర్భిణీ మహిళలు స్థానిక ఆసుపత్రిలోనే ప్రసవాలకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసూతి వైద్యురాలు డాక్టర్ మౌనిక, హెడ్ నర్సింగ్ ఆఫీసర్ ఆశావర్ధిని, నర్సింగ్ ఆఫీసర్ వీర కుమారి, ఏఎన్ఎమ్ సుజాత, పీసీ అనూష తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ

- మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో ట్రావెలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కారం
- మహిళా సిబ్బంది సేవలకు ప్రశంసలు

మల్కాజిగిరి, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సబర్బన్ ట్రైన్ ట్రావెలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా సఫాయి సిబ్బందికి చీరలు పంపిణీ చేసి వారి సేవలను గౌరవించారు.ఈ సందర్భంగా బిందు ఎలక్ట్రికల్, మాధురి ఎస్ & టీ, కాంచన కమర్షియల్, మౌనిక ఆర్‌పీఎఫ్ విభాగాల సిబ్బందిని జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు నూర్ శాలువాతో సత్కరించారు. రైల్వే స్టేషన్‌లో పరిశుభ్రత, ప్రయాణికుల సేవలో సిబ్బంది చేస్తున్న కృషిని ఆయన కొనియాడుతూ, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా నిబద్ధతతో సేవలు అందించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ఏ.వి. స్వామి, భరద్వాజ్, స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్ రావు, శంకర్ రావు, ఆఫజలుద్దీన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి ఎమ్మెల్యే బండారి

- హెచ్ బి కాలనీ డివిజన్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- కాలనీ మహిళలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే

ఉప్పల్, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): మీర్‌పేట హౌసింగ్ బోర్డు డివిజన్‌లో బి ఆర్ సి పార్టీ మాజీ డివిజన్ అధ్యక్షుడు వంజరీ ప్రవీణ్ కరిప ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు కుటుంబం మరియు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. విద్య, ఉద్యోగాలు, వ్యాపారం తదితర రంగాల్లో మహిళలు ముందుకు సాగుతూ తమ ప్రతిభను నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య, స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

"కావూరి సాంబశివరావు" రాజకీయాల్లో, వ్యాపార రంగంలో మచ్చలేని నాయకుడు

కావూరి మృతి పట్ల మాజీ ఎంపీ నామ తీవ్ర దిగ్భ్రాంతి

ఖమ్మం బ్యూరో, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తన చిన్న మామయ్య అయిన మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న మాజీ ఎంపీ నామ ఉద్వేగానికి లోనయ్యారు. ఇటీవల నామ కావూరిని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. త్వరగా కోలుకుంటారని భావించిన సమయంలో ఇలా జరగడం ఎంతో బాధాకరమని నామ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణం దేశ రాజకీయాలకు, తెలుగు ప్రజలకు తీరని లోటని అన్నారు. రాజకీయాల్లో, వ్యాపార రంగంలో ఎంతో అనుభవం గడించిన వ్యక్తి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమైన వ్యక్తి ,రాజకీయాల్లో, వ్యాపారాల్లో మచ్చలేని నాయకుడే కాక కావూరి నామకు బంధుత్వాల్లో పెద్ద దిక్కుగా ఉండేవారని తెలిపారు.

రాజకీయ రంగంలో అడుగుపెట్టిన నాటి నుండి కూడా కావూరి ప్రజా సేవకు అంకితభావంతో పనిచేసిన అనుభవజ్ఞుడైన నాయకుడని, ఐదుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై, ఒకసారి కేంద్ర జౌళీ శాఖ మంత్రిగా పని చేసిన సమయంలో ప్రజా సమస్యలను ధైర్యంగా ప్రస్తావిస్తూ దేశాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. తన దగ్గరకు సహాయం కోరి వచ్చిన ఎందరికో తన వంతు సహాయ సహకారాలు అందించారని, అంతే కాకుండా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన నిరంతరం పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందటంతో పాటు దశాబ్దాల పాటు రాజకీయాల్లో కొనసాగుతూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న నాయకుడిగా కావూరి నిలిచారని నామ తెలిపారు. పారిశ్రామిక రంగం, మౌలిక వసతుల అభివృద్ధి విషయంలో కూడా ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైందన్నారు. వ్యాపార, రాజకీయాల్లో ఆయన అనుభవం, దూరదృష్టి, పరిపాలనా నైపుణ్యం అనేక మందికి మార్గదర్శకంగా నిలిచిందని వెల్లడించారు.

కావూరి సాంబశివరావు మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు మరియు అభిమానులకు నామ నాగేశ్వరరావు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు. ఆయన చేసిన సేవలు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయని నామ ఉద్ఘాటించారు.

మంగంపల్లి అంగన్వాడీ కేంద్రంలో స్వయం పరిపాలన దినోత్సవం

పెద్దమందడి,మార్చి11(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి అంగన్వాడీ కేంద్రంలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.చిన్నారుల మేధో వికాసం, నైపుణ్యాల అభివృద్ధి మరియు వారి ప్రగతిని అంచనా వేసేందుకు ప్రతి సంవత్సరం ఒకసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా చిన్నారులు వివిధ విద్యా కార్యక్రమాలు, ఆటలు, పాటలు, కథలు చెప్పడం వంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పిల్లలలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు వారి అభ్యాస స్థాయిని పరిశీలించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.అంగన్వాడీ ఉపాధ్యాయులు పిల్లలకు సంవత్సరం పొడవునా అందించిన విద్య, పోషణ, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై తల్లిదండ్రులకు వివరించారు.పిల్లల మేధో వికాసం, సామాజిక నైపుణ్యాలు, సృజనాత్మకత ఎలా అభివృద్ధి చెందాయో ప్రదర్శనల ద్వారా చూపించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనన్య, శ్రావణి, జానకి, అక్షయ, రిషి, శ్రీనుష్, ఈశాంత్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే తల్లిదండ్రులు, గ్రామస్థులు కూడా హాజరై చిన్నారులను ప్రోత్సహించారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యం గ్రామంలోని నీటి నిల్వ ట్యాంకుల శుభ్రపరిచిన సర్పంచ్

పెద్దమందడి,మార్చి11(తెలంగాణ ముచ్చట్లు): మన గ్రామం - మన అభివృద్ధి అనే నినాదంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న గౌరవ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని నీటి నిల్వ ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నారు. గ్రామంలో ఉన్న నీటి నిల్వ ట్యాంకులు పరిశుభ్రంగా ఉండాలని, ప్రజలకు అందే తాగునీరు స్వచ్ఛంగా ఉండాలని సర్పంచ్ ప్రత్యేక దృష్టి పెట్టారు.అంటు వ్యాధులు, దురద, అలర్జీ వంటి ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ట్యాంకులను బ్లీచింగ్ పొడి ఉపయోగించి శుద్ధి చేశారు.ఈ కార్యక్రమంలో నీటి సరఫరా బాధ్యతలు నిర్వహిస్తున్న జుర్రు శివతో కలిసి సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ దగ్గరుండి పనులు చేయించారు.అంతే కాకుండా ఆయనతో పాటు శ్రీకాంత్ రెడ్డి కూడా స్వయంగా ట్యాంకుల శుభ్రపరిచే పనుల్లో పాల్గొన్నారు.గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు.

రైతులు నేరుగా విక్రయించేలా గోపాలపూర్‌లో వారసంత ప్రారంభం

ఎల్కతుర్తి, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాలపూర్ గ్రామంలో బుధవారం గోపాలపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వారసంత (అంగడి) కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్, మండల పంచాయతీ అధికారి రవి హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ కర్రె లక్ష్మి బిక్షపతి వారసంత అంగడిని ప్రారంభించారు. గ్రామంలో వారసంత ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ కర్రె లక్ష్మి బిక్షపతి మాట్లాడుతూ గ్రామంలో వారసంత ఏర్పాటు చేయడం వల్ల గ్రామ ప్రజలకు తాజా కూరగాయలు, పండ్లు మరియు వివిధ రకాల అవసరమైన వస్తువులు ఒకే చోట అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే రైతులు తమ పంటలను నేరుగా సంతకు తీసుకువచ్చి విక్రయించడం ద్వారా మంచి ధర పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులు మరియు కొనుగోలుదారులకు ఈ సంత ఎంతో ఉపయోగకరంగా మారుతుందని ఆమె అన్నారు. పరిసర గ్రామాల నుంచి కూడా వ్యాపారులు సంతకు వచ్చి తమ వస్తువులను విక్రయించగా, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొనుగోళ్లు చేశారు. తాజా కూరగాయలు, పండ్లు నేరుగా రైతుల నుంచి లభించడంతో కొనుగోలుదారులు సంతోషం వ్యక్తం చేశారు. రైతులు కూడా తమ పంటలకు మంచి ధర దొరికే అవకాశం ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్, మండల పంచాయతీ అధికారి రవి, సర్పంచ్ కర్రె లక్ష్మి బిక్షపతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి గణపతి, ఉప సర్పంచ్ మారుపాక సందీప్, వార్డు సభ్యులు బోయినపల్లి రజిత, సూర సాంబరాజు, వల్లపు స్వప్న, నమిండ్ల శివకృష్ణ, జూపాక సంధ్యరాణి, కొమురవెల్లి మనోజ్, ఊట్కూరి భాస్కర్, శ్రీపతి లావణ్య, యెల్తూరి చరణ్, గ్రామ ప్రముఖులు, రైతులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భూగర్భ జలాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి నివారణకు భూగర్భ జల వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు.కేంద్రీయ భూగర్భ జల బోర్డు, జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్-మల్కాజ్గిరి ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ శాఖల ఇంజనీర్లు, క్షేత్ర మరియు సాంకేతిక సహాయకులకు భూగర్భ జలాల సంరక్షణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హాజరై మాట్లాడారు.భూగర్భ జలాల సంరక్షణపై శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనల ఫలితాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చేయడానికి ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా భూగర్భ జలాలను సంరక్షించుకోవచ్చన్నారు. స్వాతంత్ర్యం తరువాత పెద్ద ఎత్తున సాగు ప్రాజెక్టులు నిర్మించి నదీ జలాలను వినియోగించినట్టే, ప్రస్తుతం అంతరించిపోతున్న భూగర్భ జలాలను కాపాడుకోవడానికి ఇంకుడు గుంతలు, నీటి కుంటలు వంటి నిర్మాణాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.సీజీడబ్ల్యుబి శాస్త్రవేత్త డాక్టర్ పండిట్ మధునూర్ మాట్లాడుతూ భూగర్భ జలాలను సాంకేతికంగా ఎలా సంరక్షించుకోవాలి, వాటికి ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో తెలియజేయడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చన్నారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధీర్ బాబు భూగర్భ జలాల ప్రాముఖ్యత, పరిరక్షణపై ఉదాహరణలతో వివరించారు. మేడ్చల్ జిల్లా భూగర్భ జల స్థితిగతులను జిల్లా భూగర్భ జల అధికారి ఎం. హరీష్ బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు.ఈ సందర్భం గా కేంద్రీయ భూగర్భ జల మండలి మరియు జిల్లా భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన అక్విఫర్ మేనేజ్‌మెంట్ మరియు భూగర్భ జల గణన నివేదికలను అతిథులు విడుదల చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మాధవ్, యాదయ్య, రాంబాబు, అమన్ జైన్, భూగర్భ జల శాఖ అధికారులు సత్యనారాయణ, వంశీకృష్ణ, కార్తీక ప్రియ, కమల కుమారి, కార్తీక్, రాకేష్, పవన్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాంబశివరావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో సహస్ర రోబో స్పార్క్ ఫేర్ – 2026

- విద్యార్థుల సృజనాత్మకతకు అభినందనలు తెలిపిన నెమలి అనిల్ కుమార్

మల్లాపూర్, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ పరిధిలోని మల్లాపూర్ భవాని నగర్‌లో ఉన్న సహస్ర స్కూల్‌లో "సహస్ర రోబో స్పార్క్ ఫెయిర్ - 2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల రోబోటిక్స్, సైన్స్ ప్రాజెక్ట్ స్టాళ్లను ఆయన సందర్శించి వారి సృజనాత్మకతను అభినందించారు. చిన్నారులు తయారు చేసిన రోబోలు, సైన్స్ మోడల్స్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ, ఆలోచనా శక్తి అభినందనీయమని తెలిపారు. చిన్న వయసులోనే సైన్స్, టెక్నాలజీపై ఆసక్తి పెంపొందించుకుంటే భవిష్యత్తులో గొప్ప ఆవిష్కరణలకు దారి తీస్తుందని అన్నారు. ఇలాంటి సైన్స్ ఫేర్స్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో నేడు మహిళా జన్ సున్వాయ్

మల్కాజిగిరి, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల సమస్యలను నేరుగా విని పరిష్కారం చూపేందుకు జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహిళా సున్వాయ్ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.నేడు (మార్చి 12) మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌లో మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ విజయా రహత్కర్ అధ్యక్షత వహించనున్నారు.మహిళల సమస్యలను నేరుగా విని వారికి తక్షణ పరిష్కారం చూపే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన మహిళలు తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఈ సమావేశంలో సమర్పించవచ్చని పేర్కొన్నారు. అలాగే వాక్-ఇన్ ఫిర్యాదులను కూడా స్వీకరించి సంబంధిత అధికారులతో పరిశీలించి చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

ఉత్తమ ఎంఈఓగా రాజేశ్వరరావుకు అవార్డు.!

◆ ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘన సత్కారం.

సత్తుపల్లి, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) నక్కా రాజేశ్వరరావుకు "ఉత్తమ ఎంఈఓ" అవార్డును ప్రదానం చేశారు. మండలంలో విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం, మధ్యాహ్న భోజన పథకాన్ని విజయవంతంగా నిర్వహించడం, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అంకితభావంతో సేవలందించడం, అక్షరాస్యత అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం రాజేశ్వరరావును ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, పులి శ్రీనివాసరావు, నాయుడు వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, ఎదుల్ల మురళి తదితరులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడాది పూర్తి చేసుకున్న పెద్దమందడి ప్రెస్ క్లబ్

◆ భవన మంజూరు కోసం ఎదురుచూపులు –
◆ జర్నలిస్టుల్లో ఆత్మపరిశీలన

పెద్దమందడి,మార్చి11(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి ప్రెస్ క్లబ్ ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా జర్నలిస్టులు తమ కార్యకలాపాలపై ఆత్మపరిశీలన చేపట్టారు.స్థానిక జర్నలిస్టుల ఐక్యత, వృత్తి పరిరక్షణ లక్ష్యంగా ఏర్పడిన ప్రెస్ క్లబ్ ఈ ఏడాది కాలంలో పలు కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, ముఖ్యంగా ప్రెస్ క్లబ్ భవన మంజూరు విషయంలో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయినట్లు సభ్యులు అభిప్రాయపడ్డారు.ప్రెస్ క్లబ్ ఏర్పడిన వెంటనే జర్నలిస్టుల కోసం శాశ్వత భవనం అవసరమని గుర్తించిన సభ్యులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులను కలుసుకొని వినతిపత్రాలు సమర్పించారు.అయినప్పటికీ ఇప్పటి వరకు భవన మంజూరుపై స్పష్టమైన నిర్ణయం వెలువడకపోవడం పట్ల జర్నలిస్టులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రెస్ క్లబ్‌కు స్వంత భవనం ఉంటే జర్నలిస్టులు సమావేశాలు నిర్వహించడం, వృత్తి సంబంధిత చర్చలు జరపడం, ప్రజా సమస్యలను చర్చించి ముందుకు తీసుకువెళ్లడం సులభమవుతుందని సభ్యులు పేర్కొన్నారు.ఇకపోతే ప్రస్తుతం వార్తల విషయంలో కూడా పలు లోపాలు ఉన్నాయని కొందరు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలపై వచ్చే వార్తలు కొరవడగా, కొన్నిసార్లు నాయకుల మెప్పు కోసం వచ్చే వార్తలే ఎక్కువగా కనిపిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.జర్నలిస్టులకు సరైన దిశా నిర్దేశం చేయడంలో కూడా లోపాలు ఉన్నాయని, సీనియర్ జర్నలిస్టులు జూనియర్లను సమన్వయం చేసుకొని ముందుకు నడిపించడంలో ఇంకా మెరుగుదల అవసరమని పేర్కొన్నారు.అదే విధంగా కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తరచుగా ప్రెస్ నోట్లు ఇవ్వకపోవడం కూడా గమనార్హమని చెప్పారు.కొందరికి మాత్రమే వ్యక్తిగతంగా వార్తలు పంపించడం వల్ల జర్నలిస్టుల మధ్య అసమానతలు ఏర్పడుతున్నాయని, ఇది ప్రెస్ క్లబ్ ఐక్యతకు అడ్డంకిగా మారుతోందని అభిప్రాయం వ్యక్తమైంది. ఈ పరిస్థితుల వల్ల కొన్నిసార్లు ప్రజల్లో జర్నలిస్టులపై చులకన భావన ఏర్పడే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అదనంగా ఎమ్మెల్యే సొంత మండలం అయిన పెద్దమందడిలో జర్నలిస్టులకు తగిన గుర్తింపు లభించడం లేదని స్థానిక రిపోర్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పలు అధికారిక కార్యక్రమాలకు మండల స్థాయి జర్నలిస్టులను ప్రత్యేకంగా ఆహ్వానించడం లేదని, జిల్లా స్థాయి రిపోర్టర్లకు సమాచారం అందించినా మండల స్థాయి రిపోర్టర్లకు ఆశించిన స్థాయిలో సమాచారం ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. ఉదాహరణకు మంగళవారం పెద్దమందడి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ కార్యకర్తల విస్తృత సమావేశానికి మండలానికి సంబంధించిన రిపోర్టర్లను ఆహ్వానించలేదు. జిల్లాకు సంబంధించిన వారిని మాత్రమే ఆహ్వానించారని జర్నలిస్టులు మాపోతున్నారు. ఈ పరిస్థితులు కూడా స్థానిక జర్నలిస్టుల పనితీరుపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.ఎమ్మెల్యే సొంత మండలం అయినప్పటికీ పెద్దమందడిలో ఇప్పటికీ ప్రెస్ క్లబ్ భవనం మంజూరుకాకపోవడం పట్ల జర్నలిస్టులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా భవనం ఏర్పాటు చేయడం ద్వారా వారి వృత్తి కార్యకలాపాలు మరింత సక్రమంగా కొనసాగుతాయని వారు అభిప్రాయపడుతున్నారు.ఇకపై జర్నలిస్టులు ప్రజా సమస్యలపై మరింత దృష్టి సారించి, ప్రజల గొంతుకగా నిలవాలని పలువురు సూచించారు. ప్రెస్ క్లబ్ ఐక్యతను బలోపేతం చేస్తూ, జర్నలిస్టులకు సరైన దిశా నిర్దేశం చేసే నాయకత్వం అవసరమని సభ్యులు అభిప్రాయపడుతున్నారు.అలాగే ప్రెస్ క్లబ్ భవన మంజూరు కోసం సమిష్టిగా మరింత కృషి చేయాలని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు.

రంజాన్ సందర్భంగా మైనార్టీ కుటుంబాలకు తోఫా పంపిణీ

◆ మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు చేతుల మీదుగా పంపిణీ

కాప్రా, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ డా. ఏ ఎస్ రావు నగర్ డివిజన్‌లోని మజీద్ఎ మమ్మదీయ మసీద్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మైనార్టీ కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. మసీదు అధ్యక్షులు లయన్ రియాజ్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు హాజరై మైనార్టీ సోదరులకు ప్రభుత్వం అందించిన తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పేర్కొంటూ మైనార్టీ సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మునిసాబ్ ఇక్బాల్, మొహాద్ ఘోసోద్దీన్ (సెక్రటరీ), గణిప్ప (వైస్ ప్రెసిడెంట్), యూసఫ్ (వైస్ ప్రెసిడెంట్), సలీం ఖాన్ (ట్రెజరర్), షైఖు, బషీర్ అహ్మద్ (అడ్వైజర్), జమీల్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, వి. రాజిరెడ్డి, మల్లేశం, నాగపురి రాజు, పార్టీ నాయకులు మరియు మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

◆ వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి

వేలేరు,మార్చి11(తెలంగాణ ముచ్చట్లు): వేలేరు గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అవగాహన సమావేశం నిర్వహించారు. వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో చర్చించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో గ్రామానికి మంజూరైన ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సమావేశంలో సూచించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఈ నెలాఖరు వరకు తమ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఇల్లు నిర్మించుకునే స్థోమత లేని పేద కుటుంబాలకు ఏజెన్సీ ద్వారా ఇళ్ల నిర్మాణం చేపట్టే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో తదుపరి రెండో విడతలో కూడా వేలేరు గ్రామానికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం కృషి జరుగుతోందని వెల్లడించారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం కోసం మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించేందుకు సంబంధిత గ్రామ సంస్థల ద్వారా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీకర్, గృహనిర్మాణ శాఖ సహాయ ఇంజినీరు, గ్రామపంచాయతీ కార్యదర్శి రవికుమార్, మండల సమైక్య అధ్యక్షురాలు రేణుక, వార్డు సభ్యులు సంధ్య, మౌనిక, ప్రవళిక, చైతన్య, సంధ్య, సురేష్, సునీల్, క్లస్టర్ సమన్వయకర్త రమాదేవి, గ్రామ సంస్థల ప్రతినిధులు రాణి, రాజమ్మ, ప్రేమలతతో పాటు గ్రామ పెద్దలు మరియు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

కన్న కూతురిపై అత్యాచారం చేసిన తండ్రికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

◆ వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి

వనపర్తి,మార్చి11(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పానగల్ మండలానికి చెందిన వ్యక్తి తన సొంత కుమార్తెపై అత్యాచారం చేసిన కేసులో వనపర్తి జిల్లా న్యాయస్థానం కఠిన తీర్పు వెలువరించింది.నిందితుడిపై నేరం రుజువుకావడంతో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్. సునీత బుధవారం తీర్పునిచ్చారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం, పానగల్ మండలానికి చెందిన వల్లెపోలు కురుమయ్య తన కుమార్తెకు పుస్తకాలు కొనిస్తానని చెప్పి మోసం చేసి, 2025 మే 3న పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగాపురం గ్రామ సమీపంలో

ని జూరాల కాల్వ వద్దకు తీసుకెళ్లి ఆమెపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. జరిగిన ఘటనను బాలిక తన తల్లికి తెలియజేయడంతో, మే 7న తల్లి పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు అందుకున్న వెంటనే ఎస్సై యుగంధర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా, కొత్తకోట సీఐ రాంబాబు ఆధ్వర్యంలో సాంకేతిక ఆధారాలు సేకరించి, బాధితురాలి వాంగ్మూలం నమోదు చేశారు.అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసచారి సమర్థవంతంగా వాదనలు వినిపించగా, కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్ సత్యం, కోర్టు కానిస్టేబుల్ సంజీవయ్య సహా పోలీసులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసులో నిందితుడిపై నేరం నిరూపితమైందని నిర్ధారించిన న్యాయమూర్తి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరియు కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. సమాజాన్ని కుదిపేసే నేరాలకు పాల్పడిన వారిపై కోర్టులు కఠిన శిక్షలు విధించడం వల్ల నేరస్తుల్లో భయం కలుగుతుందని, బాధితులకు న్యాయం అందించడంలో పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని ఎస్పీ తెలిపారు.ప్రజలు ఎలాంటి అన్యాయం జరిగినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అక్రమ సంబంధం కోసం భర్త హత్య... ఇద్దరికి జీవిత ఖైదు

కీసర, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భర్త హత్య కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసులో కుషాయిగూడలోని ప్రిన్సిపల్ జిల్లా & సెషన్స్ జడ్జి కోర్టు మార్చి 10న తీర్పు వెలువరించింది.కోర్టు నిందితులైన బెరా రేణుక (37), కూలీ, మరియు దేవగాడ కిషోర్ (30), హెచ్‌పీ గ్యాస్ లేబర్, నివాసం ఆర్జీకే కాలనీ, అహ్మద్‌గూడ, కీసర మండలం, మేడ్చల్ జిల్లా వారికి జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, 2019 మార్చి 13 రాత్రి రేణుక తన అక్రమ సంబంధాన్ని కొనసాగించేందుకు దేవగాడ కిషోర్ సహాయంతో భర్త బెరా వసంత్‌ను మద్యం తాగించి చేతులు, కాళ్లు కట్టి చున్నీతో గొంతు బిగించి హత్య చేసింది.



అనంతరం మద్యం సేవించి మృతి చెందినట్లు చూపిస్తూ కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు.అయితే కీసర పోలీసుల సమగ్ర దర్యాప్తు, కోర్టులో సమర్పించిన బలమైన సాక్ష్యాధారాల ఆధారంగా నిందితులు దోషులుగా తేలడంతో కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. ఈ కేసులో దర్యాప్తు అధికారిని, వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను మరియు కోర్టు కానిస్టేబుల్‌లను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అభినందించారు.

కుటుంబ కలహాలతో విషం సేవించి కూలీ మృతి

కీసర, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలం గోదుమకుంట గ్రామంలో విషం సేవించి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన చిరా లక్ష్మయ్య (50) వృత్తి రీత్యా కూలీగా పనిచేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు.కుటుంబ కలహాల నేపథ్యంలో లక్ష్మయ్య ఈ నెల 10న థమ్స్ అప్ పానీయంలో గుర్తు తెలియని విషపదార్థం కలిపి సేవించినట్లు సమాచారం. విషం సేవించడంతో అతను తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఆసు

పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మయ్య 11న ఉదయం 9.58 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడు చిరా రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీసర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆర్కపల్లి ఆంజనేయులు తెలిపారు.

ఉప్పల్ ఏసీపీని కలిసిన ఎస్సీ–ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టులు

ఉప్పల్, మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ ఏసీపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ-ఎస్టీ వర్కింగ్ జర్నలిజం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్లా సంతోష్‌కుమార్, ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఉప్పల్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఉప్పల్ పరిధిలో ఉన్న పలు సమస్యలు, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అలాగే నిత్యం జరుగుతున్న అన్యాయాల గురించి ఎల్లా సంతోష్ కుమార్ ఏసీపీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించడం జర్నలిస్టుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బొడ్డు శివతో పాటు మరి కొందరు న్యూస్ రిపోర్టర్లు పాల్గొన్నారు.

రంజాన్ స్ఫూర్తి – సామరస్యాన్ని చాటిన ఇఫ్తార్ విందు

ఖమ్మం బ్యూరో, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): రంజాన్ మాసం ఆధ్యాత్మికత, సహనం మరియు సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్న నేపథ్యంలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జెఎహెచ్ ప్రధాన కార్యాలయంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డిసిపి (అడ్మిన్) బి. రామానుజం, అడిషనల్ ఎస్పీ (ఇంటెలిజెన్స్) రామోజీ రమేష్ హాజరయ్యారు. రంజాన్ మాసం మనిషిలో ఆత్మశుద్ధి, సేవాభావం మరియు పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్ర కాలమని వారు పేర్కొన్నారు. సమాజం లో శాంతి, సౌహార్దం, సహనాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. అనంతరం అతిథులు ఉపవాసం విరమించి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు అతిథులను సత్కరించారు.

ఈ కార్యక్రమంలో మైనారిటీ శాఖ జిల్లా అధికారి ఎండి ముజాహిద్, జేఎహెచ్ జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా, సెంట్రల్ యూనిట్ అధ్యక్షులు ఇంతియాజ్, ఖమ్మం పౌరసమితి అధ్యక్షులు పులిపాటి ప్రసాద్, ఎంపీజే జిల్లా కోశాధికారి ఎండి హకీమ్, బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం, జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్, లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్రు నాయక్, దక్షిణ మధ్య రైల్వే మాజీ బోర్డు మెంబర్ మట్టా దుర్గాప్రసాద్, ఐటా కార్యదర్శి ముజీబ్, ఆర్పివి అధ్యక్షులు సంజీవరావు, మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ కార్యదర్శి రఫీక్, మీడియా కన్వీనర్ టి. సంతోష్ చక్రవర్తి, సేవా బ్యాంక్ మేనేజర్ ఎం.డి. రఫీ, ఎంపీజే సభ్యులు అహ్మద్ పాషా, ఖాజా మొహిద్దిన్, అర్షీన్, గౌస్, రజాక్, ఇలియాస్, ఇస్మాయిల్, ఫయాజ్, మతీన్, అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపవర్ కంపెనీలో ఘనంగా భద్రతా వారోత్సవం ముగింపు

- కార్మికుల భద్రత, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తాం
- ఎండి మన్నే నాగ ఫణీంద్ర

కాప్రా , మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): భద్రతా వారోత్సవం సందర్భంగా ఎంపవర్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది భద్రతా శపథం చేశారు. మార్చి 4 నుంచి 10 వరకు నిర్వహించిన భద్రతా వారోత్సవం చివరి రోజు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కంపెనీ ఎండి మన్నే నాగ ఫణీంద్ర మాట్లాడుతూ సంస్థలో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్మికుల సంక్షేమం, భద్రత కోసం నిరంతరం చర్యలు తీసుకుంటూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సంస్థ స్థాపకుడు మన్నే సుబ్రహ్మణ్యం ఆశయాలను కొనసాగిస్తూ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తున్నామని అన్నారు.కార్మికులు తమ పనుల్లో భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. భద్రతా అవగాహనతో ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎండి మన్నే నాగ ఫణీంద్రతో పాటు వెంకటేశ్వరరావు, భద్రతా అధికారి దుర్గాప్రసాద్, జగదీష్, త్రినాథ్, రాజేందర్, రత్నకుమార్, బుచ్చిబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో కార్మికులు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



ప్లాస్టిక్ గొట్టాల వల్ల పెరుగుతున్న పర్యావరణ సమస్యలు

ప్రకృతి పరిరక్షణ కోసం అవగాహన కార్యక్రమాలు
ప్రత్యామ్నాయ మార్గాల వినియోగానికి ప్రోత్సాహం

ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పర్యావరణానికి కలిగే నష్టంపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మార్చి 11న ప్రపంచ గొట్టాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సాధారణంగా చల్లని పానీయాలు తాగేటప్పుడు ఉపయోగించే ప్లాస్టిక్ గొట్టాలు చిన్నవిగా కనిపించినప్పటికీ అవి ప్రకృతికి పెద్ద సమస్యగా మారుతున్నాయి. ఎక్కువగా ఒక్కసారి మాత్రమే ఉపయోగించే ఈ గొట్టాలు తరువాత వ్యర్థాలుగా మారి భూమిలో, సముద్రాల్లో పేరుకుపోతున్నాయి. ఇవి సహజంగా కరిగిపోవడానికి చాలా సంవత్సరాలు పడుతుంది. ఫలితంగా ప్రకృతి సమతౌల్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన పెంచడమే ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. ప్రపంచంలో ప్రతి రోజు లక్షల సంఖ్యలో ప్లాస్టిక్ గొట్టాలు ఉపయోగించబడుతున్నాయి. హోటళ్లు, రెస్టారెంట్లు, పానీయాల దుకాణాలు, వేడుకలు వంటి అనేక చోట్ల ఇవి విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ గొట్టాలు తక్కువ ఖర్చుతో లభించడం, సులభంగా ఉపయోగించుకోవడం వల్ల ప్రజలు వాటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అయితే ఈ సౌలభ్యం వెనుక పెద్ద పర్యావరణ సమస్య దాగి ఉంది. ప్లాస్టిక్ పదార్థం సహజంగా కరిగిపోకపోవడం వల్ల భూమిలో చాలా కాలం వరకు అలాగే మిగిలిపోతుంది. ఇది నేల నాణ్యతను తగ్గించడమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని పెంచుతోంది. సముద్రాల్లో పడే ప్లాస్టిక్ గొట్టాలు సముద్ర జీవులకు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. తాబేళ్లు, చేపలు, పక్షులు వంటి అనేక జీవులు ఈ ప్లాస్టిక్ ముక్కలను ఆహారంగా భావించి మింగి ప్రాణాలు కోల్పోతున్నాయి. సముద్రాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నగా కనిపించే ఒక గొట్టం కూడా సముద్ర జీవులకు ప్రాణాంతకంగా మారవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అత్యంత అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు. పర్యావరణాన్ని కాపాడటానికి ప్రపంచంలోని అనేక దేశాలు ప్లాస్టిక్ గొట్టాల వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నాయి. కొన్నిచోట్ల ప్లాస్టిక్ గొట్టాల వినియోగంపై నిషేధం కూడా విధించారు. బదులుగా కాగితం, వెదురు, ఉక్కు వంటి పదార్థాలతో తయారైన గొట్టాలను వినియోగించాలని ప్రోత్సహిస్తున్నారు. కొన్ని సంస్థలు పూర్తిగా గొట్టాల వినియోగాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరిస్తున్నాయి. ఇలా చిన్న మార్పులు కూడా పర్యావరణ పరిరక్షణలో పెద్ద ఫలితాలను ఇవ్వగలవని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ గొట్టాల దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థలు, పర్యావరణ సంస్థలు, సామాజిక సంస్థలు కలిసి వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ప్రకృతి పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించడంతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తే పర్యావరణాన్ని కాపాడుకోవడం సాధ్యమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. మన రోజువారీ జీవితంలో చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా కూడా పర్యావరణ పరిరక్షణకు పెద్ద మద్దతు ఇవ్వవచ్చు. అవసరం లేని సందర్భాల్లో ప్లాస్టిక్ గొట్టాలను ఉపయోగించకుండా ఉండడం, ప్రత్యామ్నాయ పదార్థాలను వినియోగించడం వంటి చర్యలు తీసుకోవాలి. వ్యక్తిగత స్థాయిలో తీసుకునే ఈ చిన్న నిర్ణయాలు ప్రకృతి రక్షణకు ఎంతో ఉపయోగపడతాయి. మొత్తంగా చూస్తే ప్రపంచ గొట్టాల దినోత్సవం మన జీవన విధానంపై మళ్లీ ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తు చేసే రోజు. ప్రకృతి సంపదలను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించవచ్చనే సందేశాన్ని ఈ దినోత్సవం ప్రపంచానికి తెలియజేస్తోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని అనేక దేశాలు ప్లాస్టిక్ గొట్టాల వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నాయి. కొన్నిచోట్ల హోటళ్లు, ఆహార కేంద్రాల్లో ప్లాస్టిక్ గొట్టాల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. బదులుగా కాగితం, ఉక్కు, వెదురు వంటి పదార్థాలతో తయారైన గొట్టాలను వినియోగించాలని ప్రోత్సహిస్తున్నారు. ఇలా ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణానికి కలిగే నష్టాన్ని తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచ గొట్టాల దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు ప్రజలకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని వివరించుతున్నాయి. చిన్న మార్పులు కూడా పెద్ద ఫలితాలను ఇవ్వగలవని నిపుణులు చెబుతున్నారు. ఒక్కొక్క వ్యక్తి ప్లాస్టిక్ గొట్టాల వినియోగాన్ని తగ్గిస్తే పర్యావరణ పరిరక్షణకు పెద్ద మద్దతుగా నిలుస్తుందని వారు పేర్కొంటున్నారు. మొత్తంగా చూస్తే ప్రపంచ గొట్టాల దినోత్సవం మన రోజువారీ అలవాట్లపై మళ్లీ ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తు చేసే రోజు. ప్రకృతి సంపదలను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించవచ్చనే సందేశాన్ని ఈ దినోత్సవం అందిస్తోంది.

మనిషి విలువను తెలియజేసే కృతజ్ఞత భావం

మనిషి జీవితంలో ఎన్నో విజయాలు, ఆనందాలు కనిపిస్తాయి. అయితే ఆ విజయాల వెనుక చాలా మంది వ్యక్తుల సహాయం, ప్రోత్సాహం దాగి ఉంటుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, గురువులు, సహోద్యోగులు ఇలా అనేక మంది మన ప్రయాణంలో భాగస్వాములవుతారు. వారి సహాయం లేకుండా మన జీవిత ప్రయాణం అంత సులభంగా ఉండకపోవచ్చు. అయినప్పటికీ చాలా సందర్భాల్లో వారు చేసిన సహాయాన్ని మనం సహజంగా తీసుకుంటూ కృతజ్ఞత తెలియజేయడం మరిచిపోతుంటాం. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం మార్చి 11న అంతర్జాతీయ కృతజ్ఞత దినాన్ని నిర్వహిస్తూ మనకు సహాయం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పాలని ప్రపంచానికి గుర్తు చేస్తున్నారు. కృతజ్ఞత అనేది ఒక చిన్న మాట అయినప్పటికీ దాని వెనుక ఉన్న భావం ఎంతో గొప్పది. ఒక వ్యక్తి మనకు సహాయం చేసినప్పుడు అతనికి కృతజ్ఞత తెలియజేయడం ద్వారా మనం అతని కృషిని గౌరవిస్తున్నామని తెలియజేస్తాం. ఇది కేవలం మాటల పరిమితిలో ఉండే విషయం కాదు. కృతజ్ఞత మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఒక ముఖ్యమైన విలువగా భావించబడుతుంది. ధన్యవాదాలు చెప్పడం ద్వారా మనలో ఉన్న వినయం, గౌరవం, సానుకూల దృక్పథం బయటపడుతుంది. చిన్న ధన్యవాదం కూడా ఒక మనిషి హృదయంలో ఆనందాన్ని కలిగించగలదు. కుటుంబంలో కృతజ్ఞత భావం మరింత ముఖ్యమైనది. తల్లిదండ్రులు పిల్లల కోసం చేసే త్యాగాలు, గురువులు విద్యార్థులకు అందించే మార్గదర్శనం, స్నేహితులు కష్టకాలంలో అందించే మద్దతు ఇవన్నీ మన జీవితాన్ని మలిచే అంశాలు. ఈ సహాయాన్ని గుర్తించి వారికి కృతజ్ఞత తెలియజేయడం మన బాధ్యతగా భావించాలి. కుటుంబ సభ్యుల మధ్య పరస్పర గౌరవం పెరగడానికి కూడా కృతజ్ఞత భావం ఎంతో సహాయపడుతుంది. ఒక చిన్న ధన్యవాదం కుటుంబ బంధాలను మరింత బలపరచగలదు. ప్రస్తుత కాలంలో జీవన విధానం వేగంగా మారుతోంది. ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాల కోసం పరుగులు తీస్తున్నారు. ఈ ప్రయాణంలో కొన్నిసార్లు మన చుట్టూ ఉన్నవారిని, వారు చేస్తున్న సహాయాన్ని మనం గమనించకుండా పోతుంటాం. వ్యక్తిగత విజయాలపై దృష్టి పెట్టే సమయంలో మన విజయాలకు కారణమైన వ్యక్తులను మర్చిపోవడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కృతజ్ఞత దినం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. మన జీవితంలో చిన్న సహాయం చేసిన వ్యక్తినైనా గుర్తు పెట్టుకుని ధన్యవాదాలు చెప్పడం ద్వారా మనం మానవత్వాన్ని నిలబెట్టుకుంటున్నాం అనే భావన ఈ రోజు గుర్తుచేస్తోంది.

అంతర్జాతీయ కృతజ్ఞత దినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు ఈ దినం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తాయి. మనకు సహాయం చేసిన వ్యక్తులకు ఒక చిన్న సందేశం పంపడం, వారికి ధన్యవాదాలు చెప్పడం, వారి కృషిని గుర్తించడం వంటి చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. ఈ విధంగా కృతజ్ఞత భావాన్ని ప్రోత్సహించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. మొత్తంగా చూస్తే కృతజ్ఞత అనేది ఒక చిన్న భావం కాదు, అది మనిషి విలువలను ప్రతిబింబించే గొప్ప గుణం. మనకు సహాయం చేసిన వారిని గుర్తించడం, వారికి ధన్యవాదాలు చెప్పడం ద్వారా మనం మానవత్వాన్ని నిలబెట్టుకుంటాం. అంతర్జాతీయ కృతజ్ఞత దినం మనకు ఈ విలువను మరలా గుర్తు చేస్తూ పరస్పర గౌరవం, సానుకూలతతో కూడిన సమాజ నిర్మాణానికి మార్గం చూపే ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది. కృతజ్ఞత భావం వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజానికి కూడా ఎంతో అవసరం. ఒకరిపై ఒకరికి గౌరవం, విశ్వాసం పెరగడానికి ఇది సహాయపడుతుంది. చిన్న చిన్న విషయాల్లో కూడా ధన్యవాదాలు చెప్పే అలవాటు పెరిగితే సమాజంలో సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. పిల్లలకు కూడా చిన్నప్పటి నుంచే కృతజ్ఞత భావాన్ని నేర్పించడం ద్వారా మంచి విలువలు పెంపొందించవచ్చు. అంతర్జాతీయ కృతజ్ఞత దినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు ఈ దినం ప్రాముఖ్యతను వివరించడంతో పాటు కృతజ్ఞత భావాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపడుతున్నాయి. మనకు సహాయం చేసిన వారికి ఒక చిన్న ధన్యవాదం చెప్పడం ద్వారా మనం కూడా సమాజంలో సానుకూల మార్పుకు కారణం కావచ్చు. మొత్తంగా చూస్తే కృతజ్ఞత అనేది మనిషి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే ఒక గొప్ప విలువ. అది సంబంధాలను బలపరచడమే కాకుండా మనసుకు ఆనందాన్ని కూడా ఇస్తుంది. మన జీవితంలో సహాయం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు చెప్పడం ద్వారా మనం ఒక మంచి సంస్కృతిని కొనసాగిస్తున్నట్టే. అంతర్జాతీయ కృతజ్ఞత దినం మనకు ఈ విలువను గుర్తు చేసే ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

పిండిప్రోలు జూనియర్ కళాశాల, స్తంభాద్రి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్స్, స్కేల్స్ పంపిణీ..

ఖమ్మం బ్యూరో, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): తిరుమలాయపాలెం మండలం పలు ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయానికి ఉపయోగపడే విధంగా పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్తంభాద్రి హాస్పిటల్స్ ఖమ్మం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్స్, స్కేల్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో పిండిప్రోలు, తెట్టెలపాడు, జల్లేపల్లి, సుబ్లేడు, బీరోలు, బచ్చోడు, పైనంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదవ తరగతి విద్యార్థులు లబ్ధిపొందారు. విద్యార్థులు బోర్డు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రోత్సాహం అందించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ..

- ఎమ్మార్వో లూథర్ విల్సన్, ఎంపీడీవో సిలార్ సాహెబ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు.

ఖమ్మం బ్యూరో, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): తిరుమలాయపాలెం మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద వెలుగుమట్ల గ్రామానికి చెందిన ప్రజలకు మండల తహసీల్దార్ లూథర్ విల్సన్,ఎంపీడీవో సిలార్ సాహెబ్ సంయుక్తంగా లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు అందించడం ద్వారా వారి సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు.

ఇండ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం మరియు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఐ బి ఓ పోటీల్లో ఖమ్మం జిల్లాలో అగ్రస్థానంలో శ్రీ సరస్వతి విద్యాలయం విద్యార్థులు..

- ఐబిఒ వ్యవస్థాపకుల చేతుల మీదుగా "బెస్ట్ ప్రిన్సిపాల్" అవార్డు అందుకున్న బానోత్ శ్రీనివాస్

ఖమ్మం బ్యూరో, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ నేషనల్ లెవల్ పోటీలలో శ్రీ సరస్వతి విద్యాలయం విద్యార్థులు విశిష్ట ప్రతిభ కనబరిచి ఖమ్మం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచి పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు .ఈ పోటీలలో 9వ తరగతి విద్యార్థి ఎం.రమణపూజ, 7వ తరగతి విద్యార్థి డి. వరుణ్, 6వ తరగతి విద్యార్థి బి. కార్తికేయలు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్ బషీరాబాద్లో నిర్వహించిన కార్యక్రమంలో వీరు ప్రతిష్టాత్మక బహుమతులు అందుకున్నారు.అదే వేదికపై శ్రీ సరస్వతి విద్యాలయం కరెస్పాండెంట్ బానోత్ శ్రీనివాస్ కు ఐబిఒ వ్యవస్థాపకుల చేతుల మీదుగా "బెస్ట్ ప్రిన్సిపాల్" అవార్డు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయానికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులు, ఎప్పటికప్పుడు సహకారం అందిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీ. వెంకోబా, ఐఐటీ ఇంచార్జ్ పీ. సాయి కృష్ణ తదితరులు విద్యార్థులను అభినందించారు.

అన్న మాట ప్రకారం.. 15 రోజుల్లోనే!

- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మలతో కలిసి వెలుగుమట్ల నిర్వాసితులకు పట్టాల పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి
- 'కబోదుల' పాలనలో పేదోడి ఘోష.. 'ఇందిరమ్మ' రాజ్యంలో పట్టాల పండుగ
- కూల్చినోళ్లే నీతులు చెబుతారా?.. విపక్ష నేతలపై మంత్రి పొంగులేటి నిప్పులు
- పగటి కలలు కనకండి.. 'రెడ్ బుక్' రాసే నైతిక హక్కు మీకు ఎక్కడుంది? అంటూ ఘాటు విమర్శలు

ఖమ్మం బ్యూరో, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): "రాజకీయం అంటే గద్దెనెక్కి దొరతనం చేయడం కాదు.. పేదోడి కన్నీరు తుడవడం. ఈ నెల 1వ తేదీన ఇదే వేదిక మీద నుంచి హామీ ఇచ్చాను.. 15 రోజుల్లోపు మీ సమస్య పరిష్కరిస్తానని. అన్న మాట ప్రకారం, ఇచ్చిన గడువు కంటే ముందే బాధితులుగా ఉన్న నా కుటుంబ సభ్యులను లబ్ధిదారులుగా చూడటం నాకెంతో గర్వంగా ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు." బుధవారం ఖమ్మం ఐడిఓసిలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన 311మంది వెలుగుమట్ల నిర్వాసితులకు ఇండ్ల పట్టాలు, మంజూరు పత్రాలను అందజేశారు.

కళ్లుండి చూడని కబోదులు!

గత ప్రభుత్వ పదేళ్ల వైఫల్యాలపై మంత్రి పొంగులేటి నిప్పులు చెరిగారు. "2017 నుంచి ఈ ఆడబిడ్డలు తాగడానికి నీళ్లు లేక, పాములు, జెర్రుల మధ్య నరకం అనుభవిస్తుంటే గత ప్రభుత్వానికి కళ్లు కనపడలేదా? కళ్లుండి చూడలేని కబోదుల్లా వ్యవహరించారు. 2023లో ఇదే కాలనీని కూల్చేయడానికి ప్రయత్నించినప్పుడు పేదలు మిమ్మల్ని ప్రతిఘటిస్తే తోకముడుచుకుని వెళ్లిన మీరు, ఈరోజు పేదోడి గురించి అవాకులు చెవాకులు పేలుతారా? మీకు ఆ నైతిక హక్కు ఎక్కడుంది?" అని మండిపడ్డారు.

పగటి కలలు.. 'రెడ్ బుక్' హెచ్చరికలు!

ప్రతిపక్ష నేత 'రెడ్ బుక్' రాస్తాననడంపై పొంగులేటి ఎద్దేవా చేస్తూ ఘాటుగా స్పందించారు. చీకటి పడకముందే ఎండలో పగటి కలలు కంటున్నారు. నేను ముఖ్యమంత్రిననో, కాబోయే ముఖ్యమంత్రిననో ఊహల్లో ఊగిసలాడకండి. మీ రెడ్ బుక్కులు రాసేదో.. మీరు వచ్చిన తర్వాత కక్షలు చూపించే కార్యక్రమమో.. అసలు అటువంటి అవకాశం తెలంగాణ ప్రజలు మీకు ఇవ్వరు. మీ పగటి కలలు కలలుగానే మిగిలిపోతాయి. మీ దొరల పోకడలు ఇక సాగవు" అని హెచ్చరించారు.

అర్హతే మా ప్రామాణికం..

రాజకీయ కక్షసాధింపులు ఉండవని మంత్రి స్పష్టం చేశారు. చివరికి మా మీద దుమ్మెత్తి పోసిన వాళ్లయినా సరే.. వారు నిజంగా అర్హులై ఉంటే చాలు, కడుపున పెట్టుకుని వారికి పట్టాలు ఇచ్చాం. ఇది పేదోడి దీవెనలతో వచ్చిన ప్రజా ప్రభుత్వం. 311 మందికి ఇక్కడే స్థలంతో పాటు ఇల్లు, ఇండ్ల స్థలాలు ఉన్న మరో 101 మందికి వారి వారి గ్రామాల్లోనే ఇందిరమ్మ మంజూరు పత్రాలు పంపామన్నారు. పేదోడి సొమ్ము దోచుకున్న కేటుగాళ్లు ఎంతటి వారైనా సరే.. ఉక్కుపాదంతో తొక్కి, ఆ సొమ్మును తిరిగి ఇప్పించాలని సీపీకి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

యుద్ధ ప్రాతిపదికన మోడల్ కాలనీ

కేవలం పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకోమని, వారం రోజుల్లోనే తాగునీరు అందిస్తామన్నారు. రోడ్లు, డ్రైనేజీతో పాటు స్కూల్, ఫంక్షన్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నర్సరీల సందర్శన..

- ఎంపీడీవో సిలార్ సాహెబ్

ఖమ్మం బ్యూరో, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెం, ఏలువారిగూడెం గ్రామాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల అభివృద్ధి అధికారి ఎస్‌కే సిలార్ సాహెబ్ బుధవారం పర్యటించి గ్రామపంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలను సందర్శించి పరిశీలించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, శానిటేషన్ పనుల పురోగతిని ఆయన పరిశీలిస్తూ పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గ్రామాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. చెత్తను ఎక్కడికక్కడ పేరుకుపోకుండా తరచూ శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని, గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం గ్రామపంచాయతీల ముఖ్య బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించి ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అలాగే నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పెంపకం, సంరక్షణ పనులను పరిశీలించిన ఎంపీడీవో, మొక్కలను సక్రమంగా పెంచి గ్రామాల్లో విస్తృతంగా నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడంలో నర్సరీల పాత్ర ఎంతో ముఖ్యమని, ప్రతి గ్రామంలో మొక్కల పెంపకానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో తొలి 2 మెగావాట్ సోలార్ ప్లాంట్ ప్రారంభం

- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి.
- అధికారులకు శాలువాలు కప్పి సత్కరించిన సోలార్ ప్లాంట్ నిర్వాహకులు బీరవల్లి శ్రీనివాసరావు.

ఖమ్మం బ్యూరో, మార్చి 11(తెలంగాణ ముచ్చట్లు): ఖమ్మం జిల్లాలోని తొలి 2 మెగావాట్ సోలార్ ప్లాంట్ ప్రారంభించామని సోలార్ ప్లాంట్ నిర్వాహకులు బీరవల్లి శ్రీనివాసరావు అన్నారు..ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండలం జూపెడ గ్రామ పరిధిలో 2.0 మెగావాట్ సామర్థ్యం గల సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఖమ్మం జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానం చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ పథకం కింద జిల్లాలో ఏర్పాటు చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేసిన మొదటి సోలార్ ప్లాంట్ ఇదే ఆయన తెలిపారు..జిల్లాలో ఇప్పటివరకు 43 మంది రైతులు కలిపి సుమారు 70 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయన్నారు.కొన్ని ప్రాజెక్టులు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయన్నారు..ఈ సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేయడం ద్వారా రైతుకు 25 సంవత్సరాల పాటు స్థిరమైన ఆదాయం లభించనుందని. అదేవిధంగా పునరుత్పాదక శక్తి వినియోగం పెరగడం ద్వారా కార్బన్ ఉద్గారాలు తగ్గి పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదం చేస్తాయన్నారు... పీఎం కూసుమ్ పథకం రైతులకు అదనపు ఆదాయం పొందేందుకు ఒక మంచి అవకాశం అని తెలిపారు. ఈ పథకం ద్వారా రైతులు తమ భూములను వినియోగించి సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి ఆర్థికంగా లాభపడవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి,తెలంగాణ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ పోలిశెట్టి అజయ్ కుమార్,డిప్యూటీ ఇంజనీర్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, గ్రామ సర్పంచులు గూడూరు ఉపేందర్, నరేందర్ రెడ్డి,గండు చంద్రయ్య, గూడూరు ఉపేందర్,ఆత్మ కమిటీ చైర్మన్ ఓరా వెంకటేశ్వర్లు, ఎస్బిఐ బ్యాంకు మేనేజర్, ఈపీసీ కాంట్రాక్టర్ పునర్వి ఎనర్జీస్ ప్రతినిధులు, టి జి ఆర్ ఈ డి సి ఓ ఫీల్డ్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు..

పరిసరాల పరిశుభ్రతే ప్రగతికి సోపానం

మల్లారం సర్పంచ్ కటిక కిరణ్ కుమార్

ఖమ్మం బ్యూరో,మార్చి 11 (తెలంగాణ ముచ్చట్లు): పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని మల్లవరం సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ అన్నారు, బుధవారం తల్లాడ మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంచినీటి సరఫరా బావిలో క్లోరినేషన్ చేశారు, బోర్లు మరమ్మతులు చేశారు , డ్రైనేజీలలో బ్లీచింగ్ చల్లారు పాఠశాలలో, పరిసరాలు చేశారు. ఈ కార్యక్రమంలో కటికి కిరణ్ కుమార్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఎస్ కె సిద్ధిక్ మియా, పంచాయతీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజ్ సమస్యకు చెక్...కాకరవాయి గ్రామంలో కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

ఖమ్మం బ్యూరో, మార్చ్ 11(తెలంగాణ ముచ్చట్లు): తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో చాలా కాలంగా కొనసాగుతున్న లో వోల్టేజ్ సమస్యను విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో కొత్తగా 100 హెచ్‌పి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో ఉన్న లో వోల్టేజ్ సమస్యకు పూర్తిగా పరిష్కారం లభించడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో రైతులు, గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ ప్రజలు బచ్చోడు ఏఈ మునీర్ పాషా దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజల సమస్యను గమనించిన ఆయన వెంటనే పై అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకుని 100 హెచ్‌పి ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామ ప్రజల సమస్యను త్వరగా పరిష్కరించేందుకు చూపిన చురుకుదనం, సేవా భావం అభినందనీయమని గ్రామస్తులు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించడం విద్యుత్ శాఖ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.కొత్త ట్రాన్స్ఫార్మర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన విద్యుత్ శాఖ అధికారులను గ్రామ సర్పంచ్ గూడూరు ఉపేందర్,గ్రామ పెద్దలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత కొనసాగించాలని కోరుకున్నారు.సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస చారి, డిప్యూటీ ఇంజనీర్ నాగేశ్వరరావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కోకియా నాయక్, అసిస్టెంట్ ఇంజనీర్ మునీర్ పాషా, యూసఫ్ ఎల్ ఐ, వీరభద్రాచారి లైన్మెన్, గణేష్,అశోక్ విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు..

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in